# లక్ష్మీం క్షీరసముద్ర రాజతనయాం


కథ

న్యాయపతి కమలారాంజీ

**తె**ల్లవారితే శ్రావణ శుక్రవారం! భవాని పువ్వులు, కొబ్బరికాయ, అరటిపళ్ళు కొనడానికి పూర్ణా మార్కెట్టుకి ఆటోలో వెళ్ళింది. అక్కడైతే అన్నీ చవగ్గా వస్తాయని ఆమె అభిప్రాయం.

''ఈ చేమంతి పూలు మూర ఎలాగ?'' పూలని చేత్తో పట్టుకు చూస్తూ అడిగింది భవాని.

''మూర అయిదు రూపాయలమ్మా!''



భవాని వింతగా చూసింది వాడివైపు.

''ఏంటీ మూర అయిదా? ఎక్కడా లేదు ఈ రేటు. సరిగ్గా చెప్పు ఇచ్చేమాట'' – పువ్వుల్ని అటూ ఇటూ తిప్పి చూస్తూ అంది భవాని.

''ఒక్క రూపాయి కూడా తగ్గదు. వీళ్లందరికీ అలాగే ఇస్తున్నాను. మీకిష్టమైతే తీసుకోండి. లేకపోతే లేదు'' అన్నాడు పూలమ్మేవాడు నిక్కచ్చిగా. అప్పటికే నలుగురైదుగురు ఆడవాళ్లు అక్కడ వున్నారు. వాళ్లు బేరమాడకుండానే పువ్వుల పొట్లాలు కట్టించేసుకుని, డబ్బులిచ్చి వెళ్లిపోతున్నారు.

''ఈమాత్రం దానికి ఈ పూర్ణా మార్కెట్టు దాకా రావాలా? మా సీతంపేటలోనే దొరుకుతాయి'' అంది భవాని నిర్లక్ష్యంగా అటూఇటూ చూస్తూ.

''అయితే అక్కడే తీసుకోవాల్సింది'' అన్నాడు వాడు. మబ్బులు కమ్ముకొస్తున్నాయి. ఆకాశం అంతా మేఘావృతమై వుంది. వర్షం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మారుమాట్లాడకుండా రెండు మూరలు చేమంతి పూలు తీసుకుంది. తర్వాత కొబ్బరికాయల దుకాణం దగ్గర గీసిగీసి బేరం చేసి ఒక కొబ్బరికాయ తీసుకుంది. అరటిపళ్లు అమ్మేవాడి దగ్గర అలాగే బేరం చేసి వాడిచేత తిట్లు తిని, మరొకడి దగ్గర అదే రేటుకి అరటిపళ్లు తీసుకుంది. ఆటోవాడితో బేరాలు మొదలుపెట్టింది. అప్పటికే నెత్తిమీద చినుకులు పడ్డంతో గబగబా ఆటోలోకి ఎక్కి కూర్చుంది. పొద్దున్నే శ్రావణ శుక్రవారం పూజ చెయ్యాలి. రాత్రి మడిబట్ట ఆరేసుకుంది. పొద్దుటే లేచి తలంటు స్నానం చేసి మడిబట్ట కట్టుకుని జారుముడి వేసుకుంది. వెడల్పు ముఖం మీద పావలా కాసంత బొట్టు స్టిక్కరు, రెండు చేతులకి ఎర్రటి మట్టిగాజులు, మెడలో మంగళసూత్రంతోపాటు వెండి కట్టుతో వున్న ఒంటిపేట ముత్యాల హారం, నల్లపూసల గొలుసు వున్నాయి.

వంటిల్లు, దేవుడి గది ఒకటే. ఆ గదంతా శుభ్రం చేసి ముగ్గులు పెట్టింది. దేవుడి పటాలన్నింటికీ కుంకుమ బొట్లు పెట్టి, ఒక్కొక్క పువ్వు పెట్టింది. ఇత్తడి కుందుల్లో నెయ్యివేసి దీపాలు వెలిగించింది. స్టౌ వెలిగించి గిన్నెలో పాలు పోసి పెట్టింది. పసుపు విఘ్నేశ్వరుడ్ని, పసుపు మహాలక్ష్మిని చేసి వేర్వేరు తమలపాకుల మీద పెట్టింది. అక్షింతలు కలిపి వుంచింది. పువ్వులు, కొబ్బరికాయ, అరటిపళ్లు అన్నీ పక్కన పెట్టుకుంది. పూజ మొదలుపెట్టింది.

''శుక్లాంబరధరం... విష్ణుం శశివర్ణం చతుర్భుజం...'' అంటూ ముందుగా గణపతి పూజ చేసింది. తర్వాత లక్ష్మీ అష్టోత్తరం చదవసాగింది. భవాని చదువుతూంటే అక్కడక్కడా తప్పులు దొర్లుతున్నాయి. కాని అవి తప్పులని ఆమె తెలుసుకోలేదు. గట్టిగా, చుట్టుపక్కల అందరికీ వినపడేలాగ చదువుతోంది....

''దేవ్యువాచ దేవదేవ మహాదేవ త్రికాలజ్ఞ మహేశ్వర...'' స్టౌమీద పాలుపెట్టిన సంగతి పూర్తిగా మర్చిపోయింది. పాలు... ప్రవాహంలా గట్టుమీద నుంచి కిందకు పడుతూ వుంటే ఆ శబ్దానికి ఉలిక్కిపడింది భవాని. వెంటనే ''అయ్యో! అయ్యో! పాలు...'' అరుస్తూ భర్తని గట్టిగా కేకేసి పిలిచింది. మంచి నిద్రమత్తులో వున్న జగన్నాథం కంగారుగా లేచాడు.

''ఏవండీ! పాలన్నీ పొంగిపోయాయి. అదంతా చీమలు పట్టకముందే శుభ్రం చేసేయండి'' ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది ఆమె.

కళ్లు నులుపుకుంటూనే ''ఏమిటీ గోల! అంత చూసుకోలేనిదానివి పాలు ఎందుకు పెట్టావు స్టౌమీద?''

ఉరిమినట్టుగా చూసింది భవాని భర్త వైపు.

''పాలన్నీ నేలపాలయిపోయాయి. ముందు క్లైమ్ మీద శుభ్రం చెయ్యండి. వూఁ. అలా నించుని తెల్లమొహం వేసుకు చూస్తారేం! తొందరగా కానీయండి.''

''అదికాదే...'' జగన్నాథం ఏదో అనబోతుంటే ''నేను పూజ చేసుకుంటున్నాను. మధ్యలో మాట్లాడించకండి''. ఒక్క కసురు కసిరింది.

''ప్రకృతిం... వికృతిం... విద్యాం... సర్వభూత హిత ప్రదాం శ్రద్ధాం...'' గ్యాస్ వాసన వంటిల్లంతా వ్యాపించింది.

''అమ్మో! అమ్మో! గ్యాసు లీకయిపోతోంది. ముందా గ్యాస్ కట్టేయండి'' అరిచింది భవాని. గ్యాస్ కట్టేసి బద్ధకంగా నడుస్తూ వెళ్లిపోతున్న భర్తని మళ్లీ కేకేసి పిల్చింది.

''ఏమిటీ! అప్పుడే వెళ్ళిపోతున్నారు! అదంతా గుడ్డ తెచ్చి శుభ్రం చెయ్యమన్నానా లేదా! వూఁ కానీయండి'' కయ్యిమంది.

''అబ్బ. నేనిప్పుడు చెయ్యలేనే. నాకు నిద్ర వస్తోంది''

''అదుగో. అక్కడే నాకు ఒళ్ళు మండిపోతుంది. చెప్పిన పని చెయ్యడం నేర్చుకోండి. ఇంత పొద్దున్నే లేచి కష్టపడి నేను పూజ చేసి ఎంత పుణ్యం సంపాదిస్తున్నానంటే... అది ఎవరికోసం అనుకున్నారు? మీకోసమే. నన్ను చూసి బుద్ధి తెచ్చుకోండి. మీరూ వున్నారు. ఎందుకూ? ఒక్కరోజైనా నాలాగ పూజ చేశారా? ఊఁ... ముందా పని చూడండి...''

''లక్ష్మీం క్షీర సముద్ర రాజ తనయాం... శ్రీరంగ ధామేశ్వరీం... దాసీభూత సమస్త దేవవనితాం... లోకైక దీపాంకురాం...''

పాపం జగన్నాథం భార్య నోటికి భయపడి అదంతా శుభ్రం చేశాడు.

''ఏవండీ! అప్పుడే ఎనిమిదయిపోయింది! కుక్కర్‌లో బియ్యం, పప్పు పడేయండి. అటువైపు స్టౌమీద బంగాళాదుంపలు వేయించండి. ఈ పని మనిషేమిటి ఇంకా వచ్చిచావలేదు! ఇవాళ పూజ చేసుకుంటాను. తొందరగా వచ్చి తగలడు అని మరీమరీ చెప్పాను నిన్న...

శ్రీమన్మంధ కటాక్ష లబ్ధ విభవత్‌బ్రహ్మేంద్ర గంగాధరాం... త్రైలోక్య కుటుంబినీం సరసిజాం.. వందే ముకుంద ప్రియాం...''

వీధి తలుపు చప్పుడైంది.

''ఏవండీ! నేను మడిబట్టతో వున్నాను. పూజ చేస్తున్నాను. ఆ వీధి తలుపు తీసి చావండి'' ఒక్క కేక పెట్టింది.


జగన్నాథం వెళ్లి తలుపు తీశాడు.


ఎదురుగా వెంకమ్మ చింపిరి తలతో నిల్చొని వుంది. తడిసిపోయిన చీర కుచ్చెళ్ళను బొడ్లో దోపుకుంటూ లోపలికి వచ్చింది.

''ఆలీసం అయిపోనాది బాబూ!'' దాని గొంతు విన్న భవాని చేస్తున్న పూజ ఆపేసి,

''ఏవేఁ! ఇప్పటిదాకా ఎక్కడ చచ్చావు? ఎన్నిసార్లు చెప్పాలే నీకు? పూజ వున్నరోజున తొందరగా వచ్చిచావు అని. ఒకసారి చెప్తే బుద్ధిరాదా నీకు! ఎన్నిసార్లు చెప్పించుకుంటావు! నీకసలు సిగ్గు, లజ్జ అన్నవి వున్నాయా? పండగపూట పాచి ఇల్లు వదిలేస్తే ఎంత పాపం తెలుసా? ఏమి జన్మే నీది! వెధవ జన్మ, వెధవ జన్మ...''

''ఏటమ్మోవ్! మాటలు తిన్నగా రానీ. మీకేనేటి పండగ! అందరూ పూజలు సేసుకుంటారు. అందరికీ చేసిరావాల. పన్లు తెమల్చుకుని వచ్చేసరికి ఆలీసమయినాది. నోరు పారేసుకుంటే బాగోదు. నోరు మీకే కాదు. నాకూ వుంది! వల్లకండి'' వెంకమ్మ






రుసరుసలాడుతూ నాలుగు తిరిగి వల్లించింది.

భవాని పూజ చేస్తున్నదల్లా తారాజువ్వలా లేచి దాని దగ్గరకు వెళ్ళి,

"ఏంటే? వూరుకుంటుంటే రెచ్చిపోతున్నావు! చిన్నాపెద్దా లేకుండా పండగపూట నోటికొచ్చినట్టు వాగుతున్నావు. ముదనష్టపుదానా! మిగతా వాళ్ల సంగతి నాకనవసరం! నా ఇంటికి ముందు రావాలి. అంతే. నీకీమధ్య పోయేగాలం ఎక్కువైంది. నీలాంటివాళ్లు చస్తే ఏకంగా నరకానికి పోతారు తెలుసా!"

వెంకమ్మ గిన్నెలు తోముతూ మధ్యలో భద్రకాళిలా లేచింది.

"నా సంగతేమోగాని మీరు చస్తే తప్పకుండా నరకానికేపోతారు! పాపం అమాయకపు మొగుడ్ని సాధించుకుతింటా వుంటే, కనబడ్డ వాళ్లందర్నీ ఆడిపోసుకుంటా వుంటే ఆ యమధరమరాజు వూరుకోడు!"

"ఏంటే నోటికొచ్చినట్టు పేలుతున్నావు! నేనేం చేస్తానో తెలుసా! నిన్ను శపించేస్తాను. నాలాంటి భక్తురాలితో పెట్టుకున్నావు. కుక్క చావు చస్తావు! నాశనం అయిపోతావు! నరకానికి పోతావు! నా శాపం నీకు తగుల్తుంది!" కోపంతో వూగిపోతూ అన్నది భవాని.

"ఎందుకొచ్చిన గొడవ పండగపూట పొద్దున్నే!" అని నచ్చజెప్పాలని చూసిన భర్తమీద విరుచుకుపడింది.

"మీరు నోర్మొయ్యండి. మధ్యలో కలుగజేసుకుంటే మర్యాదగా వుండదు. దీనికీమధ్య బుర్ర తిరుగుడెక్కువైంది. కొత్తగా రెండు ఇళ్లు వప్పేసుకుంది. అందుకే కళ్లు నెత్తిమీదకొచ్చాయి. పెట్రేగిపోతోంది..."

చుట్టుపక్కల ఇళ్లలోవాళ్లకి తమ ఇంటి భాగోతమంతా స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే జగన్నాథంకి భయం పట్టుకుంది, ఎవరైనా తమను చూసి నవ్వుకుంటారేమోనని!

"అమ్మా! మీకో దండం. మీ పనికో దండం. నా నెల్తన్నాను. మీ ఇంటిపని సెయ్యడం నావల్ల కాదు" ఎక్కడ పని అక్కడ వదిలేసి వెంకమ్మ లేచి వెళ్లిపోతూవుంటే, భవాని తోవకడ్డంగా నించుని,

"నా శాపం నీకు తప్పకుండా తగుల్తుంది!" అంది చెయ్యెత్తి.

"ఎల్లెల్లెమ్మా! నీతో నాకేటి!" నిర్లక్ష్యంగా, విసవిసా వెళ్లిపోయింది వెంకమ్మ.

"ఏవండీ! నా పూజ ఇంకా పూర్తవలేదు. నేను ఇంకా పూజ చేసుకోవాలి! ఈ పూటకి ఆ గిన్నెలన్నీ తోమేయండి" ఆమె ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ. ఎదురుచెప్పే ధైర్యం జగన్నాథంకి లేదు.

భవాని తిరిగి పూజ ప్రారంభించింది... "లక్ష్మీః ప్రసీదసతతం నమతాం శరణ్యే..." ఈలోగా పిల్లలు లేచిపోయారు. గిన్నెలు తోమి, వంట చేసి, పిల్లలిద్దరికీ స్నానాలు చేయించి, అన్నం తినిపించి, బ్యాగ్‌లు సర్ది స్కూలుకి పంపించేసరికి తాతలు దిగొచ్చారు జగన్నాథంకి. అప్పటికింకా భవాని పూజ పూర్తికాలేదు. నోరు నొప్పి పుట్టేలా, దవడలు పీక్కుపోయేలా, అపశృతులతో శ్లోకాలు చదువుతూ దేవుడ్ని ఇంకా హింసపెడుతూనే వుంది భవాని!!

సాయంత్రం తాంబూలం ఇవ్వడానికొచ్చింది భవాని.

"మీరు పూజలు చెయ్యరా?! అదేమిటో పూజ మూడు గంటలసేపు శుభ్రంగా చేస్తేనే నాకు తృప్తిగా వుంటుంది సుమండీ! మీకు దేవుడి మీద అంతగా భక్తి లేదనుకుంటాను. మీరు నాస్తికులా?..." ఆమె మాటలకి నా మనసు చివుక్కుమంది. ఉదయంన్నుంచీ వాళ్లింటి భాగోతమంతా కళ్లకి స్పష్టంగా కనిపిస్తూనే వుంది. మూఢత్వంతో, అజ్ఞానంతో, అహంభావంతో, మూర్ఖత్వంతో భర్తని, పిల్లల్ని, చుట్టుపక్కల వాళ్లని ఇబ్బందిపెడ్తూ చేసే పూజని నిజంగా ఆ దేవుడు మెచ్చుకుంటాడా? ఆర్భాటంకోసం చేసిన పూజలో భక్తి వుంటుందా? భక్తి మనసుకి సంబంధించినది. నేను నోరిప్పకపోతే ఆమె నోరు ముయ్యదని తెలిసి అన్నాను.

"భవానిగారూ! భక్తి కేవలం మనసుకి సంబంధించినది. 'చిత్తశుద్ధి లేని శివపూజలేలయా విశ్వానాభిరామ వినురవేమ' అన్నట్టు మనసు నిర్మలంగా లేనప్పుడు ఎన్ని పూజలు చేసినా ప్రయోజనం వుండదు! పూజకి శ్రద్ధ, భక్తి, ఏకాగ్రత ముఖ్యం. మనం ఎంతసేపు పూజ చేశాం! ఎన్ని కొబ్బరికాయలు కొట్టాం! ఎంత నైవేద్యం పెట్టాం! అన్నవి ముఖ్యంకావు! ఇతరుల్ని ఇబ్బందిపెడుతూ చేసే పూజని ఆ దైవం మెచ్చుకోడు" అంటూ దేవుడి మీద నాకున్న అభిప్రాయాల్ని స్పష్టంగా తెలియజేశాను. భవాని మరి మాట్లాడలేదు!!

★